క్లుప్తంగా

దేశమాంబకు ప్రత్యేక పూజలు



మంచాల(చేబ్రోలు): మంచాల గ్రామ దేవత దేశమాంబకు శ్రావణ మాసం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. శ్రావణమాసం మొదటి ఆదివారం పూజల కోసం అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అర్చకులు అమ్మవారికి వివిధ అభిషేకాలు, విశేష కార్యక్రమాలు నిర్వహించారు. దేశమాంబ అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో శోభయమానంగా తీర్చిదిద్దారు.

చేబ్రోలు ఎస్ఐగా వెంకటకృష్ణ బాధ్యతలు



చేబ్రోలు: చేబ్రోలు పోలీసు స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా డి.వెంకట కృష్ణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలో పలువురు ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ సతీష్ కుమార్ ఉత్తర్వులు ఇచ్చారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న పి.మహేష్ కుమార్‌ను వీఆర్‌కు పంపారు. ఈ స్థానంలో వీఆర్‌లో ఉన్న వెంకటకృష్ణ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సిబ్బంది, పలువురు అభినందనలు తెలిపారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం



పొన్నూరు: పొన్నూరు నియోజకవర్గ పరిధిలోని కాపు సామాజిక వర్గానికి చెందిన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పొందేందుకు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పొన్నూరు కాపు సేవా సమితి నిర్వాహకుడు చందు వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం సమితి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి, ఆయన మాట్లాడారు. 10వ తరగతి, ఆపై తరగతులు చదివే విద్యార్థులు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన వారికి సెప్టెంబరు మొదటి వారంలో పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాల కోసం 99499 89918 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే కేసులు



ప్రత్తిపాడు: హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే వాహన చోదకులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎస్ఐ కె.నాగేంద్ర అన్నారు. ప్రత్తిపాడులో గుంటూరు పర్చూరు పాత మద్రాసు రోడ్డుపై ఆదివారం సాయంత్రం ఎస్ఐ తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న ప్రయాణికులను నిలిపి, వారికి శిరస్త్రాణం ఆవశ్యకతను వివరించారు. ప్రతి రోజూ తనిఖీలు చేస్తామని, హెల్మెట్ లేని వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు అపరాధ రుసుం విధిస్తామని చెప్పారు. వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ పొల్యూషన్, ఇన్సూరెన్స్ పత్రాలు సక్రమంగా లేని వారికి ఫైన్ లు విధించారు.

కళాశాల విద్యార్థినికి ఆర్థిక సాయం



ఫిరంగిపురం: కుమ్మర శాలివాహన జిల్లా సంఘం ఆధ్వర్యంలో బీటెక్ విద్యార్థికి ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని అల్లంవారిపాలెం నిర్వహించిన కార్యక్రమంలో అందించారు. సంఘ సభ్యుడు కె.రాములు మాట్లాడుతూ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వెంకయ్య పిలుపు మేరకు తమ సంఘంలో ఆర్థికంగా వెనకబడిన వారి పిల్లల చదువుల నిమిత్తం సహాయం చేస్తున్నామన్నారు. మార్కాపురానికి చెందిన సీహెచ్ నీలావతి గుంటూరు రూరల్‌లోని ఆర్‌వీఆర్ కళాశాలలో బీటెక్ చదువుతుండటంతో విద్యార్థికి రూ.15 వేలు సాయం అందించినట్లు పేర్కొన్నారు.

నిర్లక్ష్యం.. నిర్వహణ అస్తవ్యస్తం

- చెత్త ట్రాక్టర్లతో దుర్గంధం విస్తరణ
- రోడ్లపై జారిపడుతున్న వ్యర్థాలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



అసౌకర్యంగా వాహనదారులు



టార్పాలిన్ కవరు లేకుండా వెళుతున్న చెత్త ట్రాక్టర్

పొన్నూరు: పొన్నూరు పట్టణ ప్రధాన రహదారులపై చెత్త లోడుతో వెళ్తున్న వాహనాలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. చెత్త ట్రాక్టర్ రోడ్డుపైకి వచ్చిందంటే ముక్కు మూసుకోవాల్సిందే. ఒకవైపు వ్యర్థాల నుంచి దుర్వాసన, మరోవైపు వాహనాల్లోంచి చెత్త ఎగిరి ఆయా ట్రాక్టర్ల వెనుక ప్రయాణిస్తున్న వారిపై పడుతోంది. చూడటానికి ఇది చాలా చిన్న సమస్యలా ఉన్నా.. ఈ సమస్య కారణంగా పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

స్వచ్ఛ పొన్నూరు అంటూ ప్రచారం చేసుకునే పురపాలిక చెత్త సేకరణ వాహనాలపై టార్పాలిన్లు కప్పకపోవడంపై పట్టణ ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ట్రాఫిక్ సమయాల్లో చెత్త సేకరణ ట్రాక్టర్ల నుంచి దుర్వాసన వస్తోంది. దీంతో ట్రాక్టర్ల వెనుకవస్తున్న వాహన చోదకులు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది. పట్టణంలో నిత్యం రోజుకు 35 టన్నుల చెత్త, వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటా సేకరిస్తున్నారు. వీటిని పట్టణ శివారులోని కంపోస్టు యార్డుకు తరలిస్తారు. ఇందుకు ట్రాక్టర్లను వినియోగిస్తారు.

నిబంధనల ప్రకారం చెత్తను తరలించే వాహనాలపై టార్పాలిన్ కప్పి తాడుతో గట్టిగా కట్టిపెట్టాలి. అయితే పట్టణంలో ప్రయాణించే చెత్త సేకరణ ట్రాక్టర్లకు ఒక్కదానికీ టార్పాలిన్లు కప్పడం లేదు. దీంతో పట్టణంలోని ప్రధాన రోడ్లతో పాటు వీధులు, కాలనీల్లో తిరిగే చెత్త సేకరణ ట్రాక్టర్ల నుంచి చిత్తు కాగితాలు, ప్లాస్టిక్ సంచులు, వ్యర్థాలు ఎగిరిపడుతున్నాయి. పట్టణంలోని రోడ్లపై ఈ సమస్య ఎక్కువగా ఉంది. ఉదయం కార్యాలయాలు, పాఠశాలలు, వ్యాపారాలకు వెళ్లే వాహన చోదకులు ఎదుర్కొంటున్న ఈ సమస్య పరిష్కారానికి తగు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అయితే మున్సిపల్ అధికారులు మాత్రం ఇవేమి పట్టించుకోవడం లేదు. ప్రజలెలాపోతే మనకేంటని దీమాగా ఉండటం గమనార్హం.

మిర్చి ఘాటు.. ప్రజారోగ్యానికి చేటు





ప్రధాన రహదారి వెంట పడేసిన మిర్చి వ్యర్థాలు

గుంటూరు రూరల్: స్థానిక మిర్చి యార్డులో ఎక్స్‌పోర్ట్ చేసే సంస్థలు కొన్ని.. నగర శివారులోని నల్లపాడు, చల్లావారిపాలెం, వెంగళాయపాలెం, తురకపాలెం, ఓబులు నాయుడుపాలెం, నాయుడుపేట, పొత్తూరు, లింగాయపాలెం ఖాళీ స్థలాలు, లాలుపురం పరిసరాల్లో షెడ్‌లు ఏర్పాటు చేసుకుని మిర్చి తొడేలను తీస్తుంటాయి. అనంతరం వ్యర్థాలను బస్తాల్లో తీసుకెళ్లి ఆయా గ్రామాల ప్రధాన వీధుల వెంట పడేస్తున్నారు. రాత్రిళ్లు వాటిని దహనం చేస్తుంటారు. ఈ క్రమంలో వాటి నుంచి వచ్చే కోరును ప్రయాణికులతో పాటు, సమీప గ్రామాల ప్రజలు పీల్చలేక దగ్గు బారిన పడుతున్నారు. వృద్ధులు, చిన్నారుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఇలాగే.. కొనసాగితే శ్వాసకోశ వ్యాధులు ఎదుర్కోవాల్సి వస్తుందని, ఊపిరితిత్తులు దెబ్బతినే అవకాశాలు లేకపోలేదని స్థానిక వైద్యులు కూడా హెచ్చరిస్తున్నారు.

మిర్చి యార్డులో మిరప కాయలు విక్రయాల అనంతరం నేలపై మిగిలిపోయి, రాలిపోయిన మిర్చి విత్తనాలు ఊడుపు పేరుతో కొందరు కొనుగోలు చేస్తారు. వాటిని నాయుడుపేట, ఓబులునాయుడుపాలెం, వెంగళాయపాలెం, పొత్తూరు, చౌడవరం గ్రామాల శివారుల్లో పెద్దపెద్ద మిషన్‌లు ఏర్పాటు చేసి తూర్పారబట్టి విత్తనాలు తయారు చేస్తుంటారు. ఈ క్రమంలో గాలికి మిర్చి ఘాటుతో కూడిన దుమ్ము తెరలు తెరలుగా రావడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అసలు మిర్చి విత్తనాలు తయారీ చేసి వాటిని నేరుగా రైతులకు విక్రయిస్తారా..? లేక ఇంకా ఏమైనా చేస్తారా..? అనే విషయాలు కనీసం వ్యవసాయ, సంబంధిత శాఖల అధికారులకు తెలియదంటే అతిశయోక్తికాదు. కనీసం వారిపై నిఘా ఉంచి, ఆ విత్తనాలు ఏంచేస్తారని అధికారులు కూడా పట్టించుకోక పోవటంతో వాటిని కొందరు నూనె తీసేందుకు వాడతారని, కొందరు నకిలీ మిర్చి విత్తనాల్లో కలుపుతారని అంటున్నారు. ఒక పక్క నకిలీ విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోయి ప్రాణాలు సైతం కోల్పోతున్న ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గుంటూరు బస్‌స్టాప్‌లో ప్రయాణికుల ఇక్కట్లు



బస్ స్టాప్‌లో తిరగని ఫ్యాన్లు



కాలిపోయిన స్విచ్ బోర్డు

పొన్నూరు: పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో ఉన్న గుంటూరు బస్ స్టాప్‌లో ఫ్యాన్లు తిరగకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలలుగా సమస్య ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. బస్ స్టాప్‌లోని విద్యుత్ స్విచ్ బాక్స్ షార్ట్ సర్క్యూట్ కారణంగా రెండు నెలల క్రితం కాలిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అప్పటి నుంచి ఫ్యాన్లు పనిచేయడం లేదు. దీంతో బస్సుల కోసం వేచిఉండే ప్రయాణికులు బస్ స్టాప్‌లో కూర్చునేందుకు అవస్థలు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే బస్ స్టాప్‌లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పెదకాకాని సీఐగా టీవీ నారాయణస్వామి



పెదకాకాని: పెదకాకాని సీఐగా టీవీ నారాయణ స్వామి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఆయన 2022లో సీఐగా ఉద్యోగ ఉన్నతి పొందారు. ప్రస్తుతంగా కారంపూడి సీఐగా పనిచేసి బదిలీపై పెదకాకాని వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుస్టేషన్‌కు వచ్చే బాధితులకు అందుబాటులో ఉంటూ చట్టప్రకారం సత్వర సేవలు అందిస్తామన్నారు. నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన సీఐ టీవీ నారాయణ స్వామిని ఎస్ఐ, సిబ్బంది అభినందించారు. ప్రస్తుత పెదకాకానిలో పనిచేసి బదిలీపై వెళ్తున్న సీఐ కొమ్మనబోయిన వీరాస్వామిని ఎస్ఐ, పోలీసు సిబ్బంది ఘనంగా సత్కరించారు.

చెరిపితే చెరిగే చరిత్ర కాదు..

అంబేడ్కర్ విగ్రహంపై దాడిని ఖండిస్తూ పెదగొట్టిపాడులో కొవ్వొత్తుల ప్రదర్శన



కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న దళిత యువకులు, పెద్దలు

పెదగొట్టిపాడు (ప్రత్తిపాడు): చెరిపితే చెరిగే చరిత్ర కాదు.. అంటూ పెదగొట్టిపాడు దళితులు భగ్గుమన్నారు. విజయవాడ నగరంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పానికి జరిగిన అవమానాన్ని ఖండిస్తూ, నిరసనగా ఆదివారం రాత్రి మండల పరిధిలోని పెదగొట్టిపాడు దళితవాడలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎస్సీ కాలనీలో దళిత మహిళలు, యువకులు, పెద్దలు స్వచ్ఛందంగా కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జోహార్ అంబేడ్కర్ అంటూ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఫోటోలు ప్రదర్శిస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఆగంతకులు రాజ్యాంగ ప్రదాత అంబేడ్కర్ విగ్రహం వద్ద విధ్వంసానికి పాల్పడటం దుర్మార్గమన్నారు. ఇలాంటి దుశ్చర్యను మూకుమ్మడిగా ఖండిస్తున్నామని చెప్పారు. దాడి వెనుక కచ్చితంగా రాజకీయ కుట్ర దాగి ఉందని అభిప్రాయపడ్డారు. ఈ దాడి ప్రజాస్వామ్యంపైనా, రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలు, దళితులపై జరిగిన దాడిగానే యావత్ దళితులు భావించాల్సిన అవసరం ఉందని ముక్తకంఠంతో నినదించారు. నగరం నడిబొడ్డున ఉన్న అంబేడ్కర్ విగ్రహానికే రక్షణ లేకపోతే దళితజాతికి ఎక్కడ రక్షణ ఉంటుందని ప్రశ్నించారు. కార్యక్రమంలో దళిత పెద్దలు పిల్లి ఆనంద్‌బాబు, బూసి సుబ్బారావు, జొన్నలగడ్డ దయానందం, మన్నవ మహేంద్ర, జొన్నలగడ్డ ప్రభాకర్, జొన్నలగడ్డ రత్నబాబు, దళిత యువత, మహిళలు, పాల్గొన్నారు.

ప్రమాదాన్ని నిలువరించారు

సాక్షి ఎఫెక్ట్

ప్రత్తిపాడు: ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను విద్యుత్ శాఖ అధికారులు సరి చేసి, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. ప్రత్తిపాడులోని వ్యవసాయ శాఖ కార్యాలయ భవనం ఆవరణలో ఉన్న విద్యుత్ మీటరు బాక్సు తెరిచి ఉండటంతో పాటు విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయంటూ ఆదివారం 'సాక్షి'లో 'ప్రమాదకరంగా విద్యుత్ తీగలు' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో విద్యుత్ శాఖ ఏఈ గౌతమ్ ఆదేశాల మేరకు లైన్‌మెన్ కొండలరావు సిబ్బందితో కలిసి ప్రమాదం జరగకుండా మీటరు బాక్సు వద్ద మరమ్మతులు చేశారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

కాకుమాను: రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యచరణ ప్రణాళికపై మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి బుధవారం వరకు శానిటేషన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, స్మూట్నీ, వీధి దీపాలు, ఇతర పాలన అంశాలపై ట్రైనర్స్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు తరగతులకు హాజరు కావాలని పేర్కొన్నారు.

లాడ్జిలలో ఆకస్మిక తనిఖీలు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లోని లాడ్జిలను ఆదివారం పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ లాడ్జిలలో ఏమైనా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయా అనే విషయాలు పరిశీలించినట్లు చెప్పారు. ప్రతి లాడ్జిలో ఎవరైనా ఉండే సమయంలో ఆధార్ కార్డుతో పాటు ఇతర ఐడీ కార్డులను తీసుకోవాలని సూచించినట్లు చెప్పారు.

విద్యార్థుల్లో దేశభక్తి భావాలను పెంపొందించాలి



విద్యార్థులతో రాజేంద్రప్రసాద్, వాసుదేవరావు, యోగి మహేశ్వరానంద స్వామీజీ

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలోనే దేశభక్తి భావాలను పెంపొందించాలని ప్రజా ఆలోచన వేదిక అధ్యక్షులు మేడూరి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. గన్నే వాసు ఆర్ట్స్, శ్రీ విశ్వకర్మ పీఠం, శంబయాచార్య లలిత కళా పురస్కారాల సంయుక్త ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం అరండల్‌పేటలోని శ్రీ దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజ ప్రాంగణంలో విద్యార్థులకు దేశభక్తి గీతాలు, అల్లూరి సీతారామరాజు, ఝాన్సీ లక్ష్మీబాయి, ఏకపాత్రాభినయాల పోటీలు నిర్వహించి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. గన్నే వాసు ఆర్ట్స్ వ్యవస్థాపకుడు వాసుదేవరావు మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాలుగా పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, నటన, సాంస్కృతిక అంశాలతో పాటు దేశభక్తి ప్రేరేపిత లఘు చిత్రాలు నిర్మిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో యోగి మహేశ్వరానంద స్వామీజీ, వి.హనుమంతరావు, కేవీ మల్లికార్జున ఆచారి, మమత, సుకన్య, హరినాథ్ బాబు, సాంబయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు. దేశభక్తి గీతాలలో కె.కమల్య(కాటూరి పబ్లిక్ స్కూల్), ఎ.నవనీత (లోటస్ ఆధ్య పాఠశాల), బీవీ చరితసాయి(కన్నా పాఠశాల), అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయంలో ఎస్.నీరజ్ (శ్రీవేంకటేశ్వర బాలకుటీర్), ఎస్.సాయికృష్ణ(విజడమ్ స్కూల్), ప్రణీత్(శిశు విద్యా మందిర్), ఝాన్సీలక్ష్మీబాయి ఏక పాత్రాభినయంలో ధృతి(కన్న స్కూల్), హరిణి(శిశువిద్య మందిర్), మోక్ష శ్రీ, వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు.

గ్రామ సింహాలతో గజగజ

- రెండు నెలల్లో 35 కుక్క కాటు కేసులు
- వీధి కుక్కల బెడద నివారణకు కనిపించని చర్యలు
- సర్వసభ్య సమావేశంలో సమీక్షకే పరిమితం..
- వాహన చోదకులు, బాటసారులపై దాడులు



గ్రామంలోని వీధిలో కుక్కల సంచారం

చేబ్రోలు: మండలంలోని వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. కుక్కల స్వైర విహారం వల్ల ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. దారిన పోయే వారిపై దాడి చేసి, కరుస్తున్నాయి. వాహనాలపై వెళ్లేవారిని కూడా వెంబడిస్తున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య అధికంగా ఉంటుంది. ప్రస్తుతం దానికంటే కుక్కల బెడద ఎక్కువగా ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విద్యార్థులు, వృద్ధులు, పాదచారులు మరింత బెంబేలెత్తుతున్నారు. కుక్కల సమస్యపై గ్రామస్తులు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఫిర్యాదుల చేసినప్పటికి ఫలితం ఉండటం లేదని గ్రామీణులు చెబుతున్నారు. వారం క్రితం జరిగిన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలోనూ సభ్యులు, అధికారులు కుక్కల బెడద నివారణపై సమీక్ష నిర్వహించారే తప్ప నివారణకు చర్యలు ఇంత వరకు తీసుకోలేదు.

మండలంలోని రెండు పీహెచ్‌సీల పరిధిలోని 13 గ్రామాల్లో 35 కుక్క కాటు కేసులు రెండు నెలల్లో నమోదయ్యాయి. మండల పరిధిలోని చేబ్రోలు, సుద్దపల్లి, వేజండ్ల, వడ్లమూడి, శేకూరు, మంచాల గ్రామాల పరిధిలో కుక్కల బెడద అధికంగా ఉంది. ఈ గ్రామాల నుంచి కుక్క కాటు కేసులు వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

కోతుల బెడదా అధికం..

కోతుల బెడదా కూడా అధికంగా ఉంది. పొలాల నుంచి ఆహారం కోసం కోతులు గ్రామాల్లోకి వస్తున్నాయి. కొత్తరెడ్డిపాలెం, వడ్లమూడి, శేకూరు గ్రామాల్లో కోతుల దాడిలో గాయపడిన కేసులు వస్తున్నాయి.

కుక్క కాటుకు గురైతే...

కుక్క కరిచిన మరుక్షణం ట్యాప్ వాటర్, డిటర్జెంట్ సబ్బుతో కడగాలి. దీంతో 90 శాతం వైరస్ సోకకుండా ఉంటుంది. గాయానికి కట్టు కట్టకూడదు. రక్తం పోతుందని కట్టు కడితే వైరస్ మరింత వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది. వెంటనే డాక్టర్‌ను సంప్రదించి రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలి.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కార్పొరేషన్ కమిషనర్ అలీంబాషా



అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అలీంబాషా

మంగళగిరి: పట్టణంలోని ఈద్గా మైదానంలో సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు వినియోగించుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ అలీంబాషా తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో ప్రజావేదికపై ఆదివారం సమావేశం నిర్వహించారు. జిల్లాలో తొలిసారిగా ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించే అవకాశం మంగళగిరికి దక్కిందని, అన్ని శాఖల సమన్వయంతో పని చేయాలని కోరారు. సోమవారం ఉదయం పది గంటలకు పట్టణంలోని గౌతమబుద్ధా రోడ్డులోని ఈద్గా మైదానంలో నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలతో పాటు ఉన్నతాధికారులు పాల్గొంటారని వివరించారు. ఆయనతో పాటు అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి రావు పాల్గొన్నారు.

ప్రొస్టేట్ క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ మొహ్సిన్ ఖాద్రి

గుంటూరు మెడికల్: ప్రొస్టేట్ సమస్యపై అప్రమత్తంగా ఉండాలని యురాలజిస్ట్ మొహ్సిన్ ఖాద్రి అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ భవనంలో సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా నిర్వహించిన 'ప్రొస్టేట్ గ్రంధి వ్యాధులు- లక్షణాలు- నివారణ చర్యలు 'అనే అంశంపై అవగాహన సదస్సు, ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. డాక్టర్ ఖాద్రి పాల్గొని ప్రసంగించారు. సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ టీ సేవ కుమార్ అధ్యక్షత వహించారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి కె.సతీష్ బాబు మాట్లాడుతూ ప్రొస్టేట్ గ్రంధి సమస్యలు ఎక్కువ మందిని బాధిస్తున్నాయని దీనికి ఇప్పుడు పూర్తి చికిత్స ఉందన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు సిహెచ్.శివాజీ, ఎన్. సాంబశివరావు, పి.సుధాకర్ రావు, టి.వి. సాయిరాం, ఎ.అనంత రామయ్య సామ్రాజ్యం పాల్గొన్నారు. సభానంతరం డాక్టర్ ఖాద్రి ప్రొస్టేట్ గ్రంధి సంబంధ వ్యాధులతో బాధపడుతున్న వారిని పరీక్షించి, వైద్య సలహాలు అందజేశారు.

మూత్ర సమస్యలపై అవగాహన ఆధ్వర్యంలో..

లక్ష్మీపురం: మూత్ర సంబంధిత వ్యాధులపై ప్రజలు అవగాహన ఉండాలని సీనియర్ యురాలజిస్ట్ సత్యనారాయణ గుప్తా అన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన కార్యాలయంలో ప్రొస్టేట్ గ్రంధి, మూత్ర సంబంధిత వ్యాధులు, చికిత్స విధానాలపై ఆరోగ్య సభ ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మూత్రపిండాల్లో రాళ్ల సమస్య కేసులు అధికమైనట్లు చెప్పారు. ప్రొస్టేట్ గ్రంధి సమస్యపై దృష్టి పెట్టాలని వివరించారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. డాక్టర్ ఎం.వి.సత్యనారాయణ గుప్తా ఘనంగా సత్కరించారు. సమావేశంలో టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, ఆరోగ్య ప్రచారకులు వీవీ రావు, విశ్రాంత ప్రిన్సిపా ఆర్.కృష్ణయ్య, రాడికల్ హ్యూమనిస్ట్ నాయకులు కే చంద్రశేఖరరావు ప్రసంగించారు.

చిత్రలేఖనం పోటీల్లో చిన్నారుల ప్రతిభ



చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న రంగిశెట్టి రమేష్ తదితరులు



చిన్నారులు నిర్వహిస్తున్న కోలాటం

తాడేపల్లిరూరల్: చిత్రలేఖనం పోటీల్లో చిన్నారులు ప్రతిభకనబరిచారు. మంగళగిరి- తాడేపల్లి బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో తాడేపల్లి పట్టణ పరిధిలోని ఆశ్రమం రోడ్డులోని అమరావతి ఐకాన్‌లో ఆదివారం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ సభకు బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా రంగిశెట్టి ఫౌండేషన్ చైర్మన్ రంగిశెట్టి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకతను పెంచడానికి మంచి కార్యక్రమాన్ని నిర్వహించారని అన్నారు. సెల్‌ఫోన్‌లు వచ్చి బాలబాలికలను ఆటలకు దూరం చేస్తున్నాయని హెచ్చరించారు. చందమామ, బాలమిత్ర, పంచతంత్ర కథలు లాంటి పుస్తకాలు కనిపించడం లేదని పేర్కొన్నారు. మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం గౌరవ అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు మాట్లాడుతూ బాలబాలికల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి ఈ పోటీలు ఉపయోగపడతాయని అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు రావూరి రమేష్‌బాబు మాట్లాడుతూ చిన్నారులు ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీల్లో పాల్గొనడం అభినందించదగ్గ విషయమని అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి కార్యదర్శి సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ పిల్లల్లో పోటీతత్వం పెరగడానికి ఈ పోటీలు దోహదం చేస్తాయని అన్నారు. బాలోత్సవం రాష్ట్ర బాధ్యులు పిన్నమనేని మురళీకృష్ణ మాట్లడుతూ బాలబాలికలు చదువుతో పాటు చుట్టుపక్కల జరుగుతున్న అనేక సమాజ పరిణామాలను కూడా గమనించాలని అన్నారు. అనంతరం డాన్స్ మాస్టర్ చందు ఆధ్వర్యంలో బాలబాలికలు వివిధ రకాల డ్యాన్సులు, స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని ప్రతిబింబించే నృత్య ప్రదర్శనలు, కోలాటం ప్రదర్శించారు. కాజ నుంచి బాలల సంఘం బాధ్యులు సింహాద్రి సుమ ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఎక్కడ వచ్చిందమ్మ స్త్రీ జాతికి స్వాతంత్ర్యం నృత్య రూపకం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎం.సంధ్యారాణి, ఇ.రాజశేఖర్, విక్రమ్, జి.రమ్య, వై.అచ్యుతరావు, పి.విజయ, నాగరాజు, వెంకటరావు, జి.సుమ, వై.సౌజన్య, ప్రకాష్ పాల్గొన్నారు.